# అతను మగాడు

(7-9-84 స్వాతి సపరివార పత్రిక)

---

నైతికంగా దిగజారి పోకూడదు అనేది మన సంప్రదాయం.
కానీ మగవాడికో నీతి, ఆడదానికో నీతి–ఇది పక్షపాతం.

—జయప్రద

---

నేనీరోజు నా పుట్టింటి వాకిట్లో అడుగు పెట్టగానే వికసించిన మా అమ్మ ముఖం ఎదురు వచ్చింది. అలా మా అమ్మను ఆనందంగా చూసి నేను రెండు సంవత్సరాలయింది.

"మన మధూ మొగుడొచ్చాడమ్మా సుమతీ, దాన్ని తీసుకెళ్తాడట" ఆమె కంఠం నిండాకూడా ఆనందం. నేను నిజానికి చాలా సంతోషించాల్సిన వార్త ఇది. కానీ నా గుండెల్లో ఎక్కడో ఏదో ఎదురు తిరుగుతున్న అనుభూతి.

"పంపిస్తున్నావా?"

"పంపించక?" ఈసారి ఆమె ముఖంలో ఆశ్చర్యం.

నేను మాట్లాడలేదు. బ్యాగ్ తీసుకొని లోపలికి నడిచాను. అమ్మ వంటింట్లోకెళ్ళింది. నాన్న రూములో నాన్నలేరు. ఆయన కుర్చీ ఖాళీగా వుంది. దాంట్లో కూర్చున్నాను. వందమైళ్ళ ప్రయాణం చేసినా రాని అలసట అమ్మ చెప్పిన వార్త విన్నాక వచ్చింది.

రెండేళ్ళుగా పుట్టింటి ఆనందాన్ని పొందటంలేదు నేను. కారణం నాతోపాటు మా అమ్మ రక్తం పంచుకుని పుట్టిన నా అన్న, నా చెల్లెలు ఈ ఇంట్లో రెండేళ్ళుగా ఒకే కష్టాల నావలో సమంగా ప్రయాణిస్తున్నారు. వాళ్ళకు లేనిది నాకుందనే అనవసరపు అపరాధభావం నన్ను వెంటాడుతూ నా స్వంత సంతోషాన్ని చంపేస్తున్న ఈ రోజుల్లో నాకు మా అమ్మ చెప్పిన వార్త కర్ణానందంగా వుండాల్సిన మాట. కానీ, నేను మా అమ్మను క్షమించలేక పోతున్నాను. ఇంత సులువుగా ఈ ఇంటి అల్లుణ్ని మా అమ్మ క్షమించడాన్ని నేను జీర్ణించుకోలేక పోతున్నాను. నా తల భారమయింది. కుర్చీలోనుండి లేచి వంటింట్లోకి తొంగిచూశాను.

"మేడమీద గదిలో మధూవుంది వెళ్ళు" అంది అమ్మ రెండేళ్ళ తర్వాత వచ్చిన రెండో అల్లుడికి మర్యాదలు చేయడానికి సతమతమై పోతూ....

మేడ అనగానే మాది బంగళాకాదు. అది మేడమెట్లకు రక్షణగా కట్టబడిన కాస్త పెద్దదైన గది. ఏ అల్లుడొచ్చినా ఆ అల్లుడికది పడగ్గది. ఒకనాటి ఈ ఇంటి కోడలిగది.

ఆఖరి మెట్టుమీద నిలబడి కొద్దిగా తటపటాయించాను. నా చెల్లెలు తాలూకు భర్త మహాశయుడు అక్కడ వుంటాడేమోనని, నా అదృష్టంకొద్దీ అతన్ని ఇప్పుడే ఆ గదిలో చూచే దురదృష్టం తప్పింది. నాకు మొదట చెల్లెలితో మాట్లాడాలని వుంది.

మధు అలంకరించుకుంటోంది. చాలా అందంగా, చాలా ఓపిగ్గా అలంకరించుకుంటున్నట్లుంది. నేనక్కడకెళ్ళి రెండునిముషాలైనా ఇంకా

కాటుక దిద్దుకుంటూనే వుంది. ఏడువందలా ముప్పయిరోజుల తర్వాత భార్య హఠాత్తుగా గుర్తుకొచ్చి పతిదేవుడొచ్చాయేమరి.

"మధూ!" ఓ వ్యభిచారి దగ్గరకు ఈః రాత్రి వెళ్ళబోతున్న నా చెల్లెలి అలంకారాన్ని చూడలేక పిలిచాను.

"అరె నువ్వా ఎప్పుడొచ్చావు?"

ఆనందంగా ఇటు తిరిగింది మాధవి. నా చెల్లెలి ముఖంలో ఆనందం చూడ్డం నాకెంతో ఇష్టమైన సంగతయినా ఎందుకనో నా మనసు ఈః క్షణంలో ఆనందాన్ని స్వీకరించలేకపోతోంది. గంటనుండి దాన్ని సర్దడానికే నేనూ శతధా ప్రయత్నిస్తున్నాను. అయినా అదినాకు క్షణక్షణం ఎదురు తిరుగుతూనే వుంది.

"ప్రకాష్ వచ్చాడట కదా!" మంచంమీద కూర్చుంటూ అన్నాను. ఆ పిల్ల కళ్ళల్లోకి నిశితంగా చూస్తూ.

"ఆ వచ్చారు" తలవంచు కుంటూ అంది.

వాలిపోయిన ఆమె కళ్ళల్లో తన భర్తను కలుసుకోబోతున్న సిగ్గుతెరలే వున్నాయో! ఇన్నేళ్ళ తర్వాత వచ్చిన భర్త దగ్గరకు తను వెళ్ళబోతున్నందుకు లజ్జాభావమే వుందో గమనించడానికి నాకు అవకాశం లేకపోయింది.

"ఇన్ని రోజులు ఎందుకు తీసుకెళ్ళలేదో అడిగావా?"

తల అడ్డంగా వూపింది మధు.

"అతనితో వెళుతున్నావా."

"ఊఁ...."

నేను మాట్లాడలేదు. నేను మాట్లాడితే ఏమి మాట్లాడతానో మధూకి అర్థమయినట్లుంది. మేమిద్దరం మంచి స్నేహితులం.

"సుమతక్కా! ఈ సమాజం సంగతి నీకు తెలియందేముంది?"

నేను మనసులోనే ఉలిక్కి పడ్డాను. ఈ ఒక్కగంటలో ఆ విష యము ఒక్కసారి కూడా నామతికితోచలేదు. ఈ రెండేళ్ళగా ఆడపిల్లగా నా చెల్లెలు సమాజం అనబడే ఈ మనుష్యుల రాక్షసత్వానికి గురి అవు తూనే వుంది. వాళ్ళు విసిరే బాణాలను నిశ్శబ్దంగా తన గుండెల్లోకి గుచ్చుకుంటూనే వుంది. ఎంత కిరాతకమైందీ సమాజం!

"నన్నిన్నాళ్ళూ ఎందుకు వదిలేసావు?" అని తన స్వంతమైన భర్తను అడుక్కునే సాహసం కూడా భార్యకు లేకుండా ఆమెను ఎంత పిరికి దాన్నిగా తయారుచేస్తుందీ సమాజం! ఆ సమాజం నమ్ముతున్న సంప్రదాయం!

నేను నిశ్శబ్దంగా లేచి క్రింద కొచ్చాను. హడావుడిపడుతున్న అమ్మ ప్రక్కన పీటవాల్చుకుని కూర్చున్నాను.

"సుమతీ! కాస్త ఆ ఉల్లిపాయలు తరిగి పెట్టు తల్లీ-నాకు కాళ్ళూ చేతులు ఆడ్డంలేదు."

మా అమ్మ మానసిక అవస్థను నేనర్థం చేసుకున్నాను.

"నువ్వు ఒక్కదానివే వచ్చావే? అల్లుడు రాలేదా? పిల్లల్ని తీసుకు రాలేదేం? లాంటి మామూలు కుశల ప్రశ్నలన్నా అమ్మ నన్ను వేయ లేదంటే– తన రెండో అల్లుణ్ని ఎలా ప్రసన్నం చేసుకుని తన రెండో కూతురి భారాన్ని దింపుకోవాలా? అనే ఆలోచన తప్ప మరో ఆలోచనకు ఆమె మెదడులో స్థానం వున్నట్లు లేదీరోజు. భర్త విసర్జితకు తల్లిగా అది ఆమెకు సహజమే. అది నేను అర్థంచేసుకున్నాను.

ఉల్లిపాయల బుట్ట ముందుకు లాక్కుని ఉల్లిపాయలు తరుగుతూ నేనూ నా చెల్లెలిని ఓ తాగుబోతు మనిదితో ఆ తిరుగుబోతు వ్యక్తితో ఆనందంగా పంపించడానికి నా మనసును సిద్ధం చేస్తున్నాను.

"మధూని ఎప్పుడమ్మా పంపిస్తున్నావ్?"

"రేపే పంపమంటున్నాడు. అదీ ఇదీ చేసి పంపాలన్నా టైమ్ లేదు. పోనీలే తీసుకెళతానంటున్నాడు అదేచాలు."

నేను తలెత్తాను. అమ్మవైపు తదేకంగా చూసాను.

"ఇక ఎప్పుడూ కష్టపెట్టకుండా చూసుకుంటానన్నాడా?" అమ్మ మూలుగులాటి శబ్దం వదిలి అంది.

"ఏదో మంచి కాలం తీసుకెళతానని వచ్చాడు. ఏమి మాట్లాడితే ఏమౌనని నేను వణికి చస్తున్నాను. మీ అన్నయ్య మాత్రం ఏదో మాట్లాడుతున్నాడు ఉదయం."

"అన్నయ్యా! ఏమన్నాడు?" నా కుతూహలం నా గొంతులో దాగలేదు.

ఏదో అన్నాడే.... ఆ.... మధూ అమాయకపు పిల్ల ఏదో తెలిసీ తెలీక ఏదైనా చేస్తే కాస్త సర్దుకోమని కాబోలు అన్నాడు తలుపు చాటు నుండి అదీ విన్నాను. చూస్తే బావుండదని వచ్చేసాను."

నేను తెల్లబోయాను.

"మధూ తెలిసీ తెలియని పిల్లా? ఈ సమాజాన్ని క్షుణ్ణంగా చదివేసి- దాని క్రూర కబంధ హస్తాల నుండి బయట పడడానికి తన కొరకు చాచిన మరో క్రూర హస్తాల్లో నిశ్శబ్దంగా ఒదిగిపోబోతున్న నా చెల్లెలు అమాయకురాలా?

నేను తెల్లబోయి మాత్రం వూరుకున్నాను. గానీ, నా మనసు వూరుకోలేదు. అది కుతకుత వుడికిపోతూ నన్ను తొందర పెట్టింది.

"మధూ ఏదో తెలిసీ తెలియక తప్పుచేస్తే అతను సర్దుకోవడమేమిటమ్మా- జీవితాంతం అతను చేసేవన్నీ సర్దుకునే దురదృష్టం యీ పిల్లదికానీ."

అమ్మ మాట్లాడలేదు. కళ్ళల్లో నీళ్ళు మటుకు నింపేసుకుంది.

అమ్మకూ తెలుసు తన కూతురు అందరి ఆడపిల్లల్లా నిశ్చింతగా బ్రతకడానికి భర్తతో వెళ్ళడం లేదని, కానీ తప్పదు, తను కన్నా, రెక్కల్లో పెట్టుకుని పెంచినా, వాడెలాంటి వాడైనా సరే తనందించే ప్రేమలో పదో వంతయినా తన బంగారు తల్లికి అందించని వాడయినా

సరే ఆ పిల్ల స్థానం వాడి దగ్గరే అనేది నాతోపాటు, నాలాటి కోట్లమంది ఆడ పిల్లలతో పాటు మా అమ్మా జీర్ణించుకుంది. జీర్ణించుకోక తప్పదు. కాదని స్వతంత్రిస్తే—ఈ సమాజం అనబడే మనుష్యుల గోడల మధ్య విధించబడ్డ నిషిద్ధాలు, ఆడపిల్లకు ఎన్ని ఎదురు దెబ్బలు తినిపిస్తాయో మాకు తెలుసు

ఆ ఎదురు దెబ్బలకు తట్టుకునే శక్తి ఆడపిల్లల బలహీనపు గుండెలకు లేదు.

నేను కొద్ది కొద్దిగా కరుగుతున్నాను. నాలో మార్పు నాకే ఆశ్చర్యంగా వుంది. రెండేళ్ళ క్రితం ఈ ఇంటికి క్రొత్తగా వచ్చి ఈ ఇంట్లో మనుష్యులుగా మారిన ఓ ఇద్దరు వ్యక్తులు చేసిన పనిని తనెంతగా అసహ్యించుకుంది! తన జన్మలో వాళ్ళను క్షమించగలదనుకుందా? కానీ ఈ రోజు అందులో ఒకర్ని క్షమిస్తోంది. తేలిగ్గా క్షమించి తన చెల్లెల్ని అతనితో పంపించబోతోంది.

"పోనీలేమ్మా! మనిషన్నాక బలహీనతలుండక పోతాయా?" ఆ మాట అని అమ్మ ఎంత కళ్ళల్లో నీళ్ళు నింపుకున్నా నేనీ మాటలు మాత్రం అనకుండా వుండలేకపోయాను.

"కానీ అమ్మా! వదినకూడా మీ అల్లుడన్ని కాకపోయినా కొన్ని బలహీనతలున్న ఆడపిల్ల ఆమెలో నీ కొడుకును కూడా సర్దుకోమని చెప్పుంటే బాగుండేది" అమ్మ కన్నీళ్ళలో కోపం తళతళ లాడింది.

"నోర్ముయ్!"

అమ్మ నా నోరు మూసింది. నా మనసును మాత్రం మూయడానికి అశక్తురాలయింది.

తప్పు ఎవరు చేసినా తప్పే అనేది నా సిద్ధాంతం. ఒక రూలంటూ వుంటే ఆ రూలు అందరికీ వర్తిస్తుందనేది నా వాదన.

వదిన తప్పుచేసింది. నేను ఒప్పుకుంటున్నాను. ఓ పెళ్ళయిన యువతి- ఓ ఇంటి పరువు ప్రతిష్టలు, బరువు బాధ్యతలు నెత్తిన వేసు

కుంటున్నానని ప్రమాణం చేసి పాణి గ్రహణం చేసిన గృహిణి ఓ బిడ్డకు తల్లి అయ్యాక కూడా మరో వ్యక్తి మీద మనసుపడి బిడ్డను కూడా వదిలేసి వెళ్ళడం ఘోరమైన నేరమే నా దృష్టిలో. పెళ్ళి చేసుకున్నాక జీవిత భాగస్వామితో కడదాకా బ్రతకాలనేది నా మనోగతాభిప్రాయం. అందుకే ఆ రోజు అందరితో పాటు నేనూ ఆమె చేసిన పనిని గర్హించాను. నేనూ విమర్శించాను. అందరికంటే ఎక్కువగా నేనూ ఆమెను అసహ్యించుకున్నాను.

తొలిరోజుల ఆవేశం మంచులా దిగిపోయాక తనేమి చేసిందో తనకు తెలిసివచ్చాక తను పోగొట్టుకున్నది తను గ్రహించుకున్నాక తనను తీసికెళ్ళిన మనిషికి తన మీద భ్రాంతి తప్ప ప్రేమ లేదని అర్థం చేసుకున్నాక అతన్ని వదిలేసి వచ్చి 'నా బిడ్డను చూడందే నేను బ్రతకలేకున్నాను. ఈ ఇంట్లో మాత్రం నాకింత చోటివ్వ'మని కాళ్ళు పట్టుకున్న ఆ ఆడపిల్లను అందరం కలిసి ఒకే మాట మీద నిర్ధయంగా ఆ అర్ధరాత్రి వెళ్ళ గొట్టినప్పుడు అన్నమనసు మాత్రం కొంత రాజీపడినట్టుంది. కానీ మెత్తబడ్డ కొడుకువంక ఈసడింపుగా చూసి.

"నీకు సిగ్గులేదట్రా" అన్న తల్లి కనీసం వందమంది ఆడపిల్లల శీలాల్తో ఆడుకుని వచ్చిన అల్లుడితో ప్రయాణం అవడానికి సిద్ధంగా వున్న కూతుర్ని ఆ మాట అనదేం?

"యిక ఆ పాపిష్టిదాని మాట నా దగ్గరెత్తకు" ఆఖరి హెచ్చరిక ఇచ్చిన అమ్మవైపు చూసాను. ఆమె వినరాని మాట విన్నదానిలా ముఖం పెట్టుకుని తన అల్లుడి కొరకు తయారు చేసిన చికెన్ కూరలో ఉప్పు చూస్తోంది. నేనిక అమ్మతో వాదించదల్చుకోలేదు. అమ్మ మూర్ఖత్వం నాకు తెలుసు.

మనిషిలో సహజంగా చాలా బలహీనతలుంటాయనేది నేనానాడు అర్థం చేసుకోలేదు. ఒక ఇంటి కోడలు, ఒక భార్య, ఒక తల్లి నా దృష్టిలో చేయకూడని నేరం మా వదిన చేసింది. నేను క్షమించ లేకపోయానామెను. రెండేళ్ళ క్రితం ఇంతకంటే పసిదాన్ని నేను. నా వయస్సు నా అనుభవాలు నాకు ఈనాడు కొంత వివేకాన్ని నేర్పాయి.

మనిషి తన బలహీనతల్ని తెలుసుకుని ఆ తప్పు మరోసారి చేయనని హామీ ఇచ్చినప్పుడు వాళ్ళను క్షమించే ఎత్తుకు ఎదిగానీ రోజు నేను.

ఈ రోజు వచ్చిన ఈ ఇంటి అల్లుడు కూడా నిజంగా మారి ఇక అలాటి తప్పు చేయనని హామీ ఇచ్చినప్పుడు—ఆ హామీ, నిజాయితీ మీద నాకు నమ్మకం కలిగితే అతన్ని క్షమించి నా చెల్లెల్ని ఆనందంగా అతనితో పంపడానికి నా కభ్యంతరం లేదు. కానీ ఇదే ఇంటిలో ఈ ఇంటి కోడలే అతను చేసిన తప్పే చేసింది. ఆమె తన తప్పు తెలుసుకుంది. ఆ తప్పు మరి జన్మలో చేయనని ఒట్టువేసి ఏడ్చింది. ప్రార్థించింది. అయినా మేము క్షమించలేదు. ఈ రోజు కనీసం నేను మారాను అనయినా చెప్పని అల్లుణ్ని ఎంత తేలిగ్గా క్షమించగలుగుతున్నారు వీళ్ళు!

నిట్టూర్చిలేచి విశ్రాంతి కొరకు నాన్న గదిలోకి వెళ్ళాను కానీ అక్కడ నాకు విశ్రాంతి దొరికే అవకాశం కన్పించలేదు. కొన్ని గంటల క్రితం నేను అశాంతిగా కూర్చున్న ఈజీ ఛెయిర్‌లో నాన్న అదే అశాంతితో కూర్చొనున్నారు.

"ఎప్పుడొచ్చావమ్మా" అని ముభావంగా పలకరించారు.

"ఏమిటినాన్నా ఆలోచిస్తున్నారు? అల్లుడిగారికి ఏం పెట్టాలా? అనా?" నాలో ఆవేశం చల్లారకముందే పాపం పిచ్చినాన్న నా ఎదురు పడ్డాడు.

"ఆ భ్రష్టుడికి పెట్టడం కూడానా" అని చీదరించుకున్నాడు. నాన్న పరవాలేదు ఈ ఇంటి అల్లుడు ఓ భ్రష్టుడని మా నాన్నయినా గ్రహించాడు!

"నీ కన్న కూతుర్నే అతని చేతుల్లో పెడుతున్నావు. యింకేం పెట్టకపోతే ఏంలే నాన్నా" ఇంకా వ్యంగ్యంగా అన్నాను.

కళ్ళెత్తి దీనంగా చూసాడు నాన్న.

నాన్నలో ఇప్పుడు ఆ భ్రష్టుడు అన్న వ్యక్తినికాక, ఆ భ్రష్టుడి భార్యను కన్న తండ్రిని చూసాను. నాన్నను చూస్తే జాలేసింది.

"ఇక మరే ఆడపిల్లను కన్నెత్తి చూడకుండా వుంటాననైనా

మాట తీసుకుని మధూని పంపిస్తే బాగుంటుంది నాన్నా" మెత్తగా అన్నాను.

"మగాడు మాటివ్వడం ఎంత సేపులే తల్లీ. కుక్క తోక వంకరవి తెలీదమ్మా నీకు?"

అమ్మ మూఢత్వంలాగా నాన్న నిస్సహాయ వేదాంతధోరణికూడా నచ్చలేదు నాకు. నాన్నతో నాలుగు మాటలు మాట్లాడి వరండాలో కొచ్చాను

* * * *

"ఎప్పుడొచ్చావమ్మా" బయట నుండి వస్తూనే పలకరించాడు అన్న.

"ప్రొద్దున."

"బావ బావున్నాడా?"

"బాగున్నాడు....రేపు మధూని అతనితో పంపిస్తున్నావుకదూ"

"ఆఁ వచ్చి పంపించమన్నాడు."

"పంపిచమనగానే నువ్వు పంపిస్తున్నావు" ఒక్కొక్క పదాన్నే ఒత్తి పలుకుతూ అన్నాను.

"ఏం నీకిష్టంలేదా?" వరండా కటకటాల తలుపులువేస్తూ ఎదురు ప్రశ్న వేసాడు అన్న.

"నా ఇష్టం సంగతి వదిలేయ్. నువ్విష్టపడే పంపిస్తున్నావా?"

"అతను తీసుకెళతానని వచ్చాడు" ఆ ప్రశ్నకతనివ్వాల్సిన జవాబది కాదు కానీ అతను తప్పించుకుంటూ ఇచ్చిన సమాధానం అది.

"వదిన కూడా నీతో వుంటాననే వచ్చిందిగా ఆ రోజు" సూటిగా అతని కళ్ళల్లోకి చూస్తూ అన్నాను.

నా దగ్గర నుండి ఆ ప్రసక్తి ఎదురు చూడలేదేమో షాక్ తిన్న ట్టుగా చూసాడు ఆ తర్వాత తేరుకుంటూ అన్నాడు.

"ఆ చెడిపోయినదాన్ని...."

నేను మా అన్న మాటలను పూర్తి చెయ్యనివ్వలేదు.

"వదిన చెడిపోయిందే అంతకు రెండింతలు చెడిపోయి కుళ్ళి పోయాడు ఈ ఇంటి అల్లుడు. అది గుర్తురాదేం మీకు?" తీవ్రంగా అన్నాను.

అన్న మాట్లాడలేదు.

"నువ్వు సంతోషంగా నీ చెల్లెల్ని ఈ ఇంటి అల్లుడు తన కుళ్ళు కడుక్కోకపోయినా అతని వెంట పంపిస్తున్నావు. నీ భార్య తప్పు తెల్సుకుని అలాటి తప్పు ఈ జన్మలో చేయనని నీ కాళ్ళు పట్టుకున్నా ఆమెను విదిలించికొట్టావు. నువ్వు....ఏం మనుష్యులు మీరు మీ మనస్సు లసలే విధంగా ఆలోచిస్తున్నాయో ఆత్మపరిశీలన చేసుకోరేం? వెళ్ళ-వెళ్ళి నీ పిలుపు కోసం ఒళ్ళంతా చెవులు చేసుకుని ఎదురుచూస్తున్న నీ భార్యని క్షమించి తీసుకొచ్చుకో ఆ తర్వాత ఈ ఇంటి అల్లుడ్ని క్షమించి నీ చెల్లెల్ని అతనితో పంపుదువుగాని."

అన్న తలవంచుకున్నాడు. విపరీతమైన సంఘర్షణకు లోనవు తున్నట్టుగా కళ్ళు మూసుకుని తెరిచాడు. నేనతని ఆలోచనలకతన్ని వదిలేసాను.

★ ★ ★ ★

అన్నని వదిలేసి వచ్చి హాల్‌లో దివానుమీద పడుకున్నాను. ఎంతకూ నిద్ర రావడంలేదు. మెల్లిగా లేచి మెట్ల గదిలోకెళ్ళాను మధు ప్రక్కన స్థలం ఖాళీగా వుంది.

ఆ స్థలంలో పవిత్రంగాపడుకోవాల్సిన ఆ యింటి అల్లుడు ఎక్కడ ఏ అపవిత్రమైన పని చేస్తున్నాడో....? పాపం అన్న అటు వదిన వెళ్ళి

పోయినా యింకా పవిత్రంగానే వున్నాడు అలాటి అన్నతో అంత విసురుగా మాట్లాడాల్సింది కాదు.

నిద్రలో నావైపు తిరిగి నా పైన చెయ్యి వేసింది మధు. ఆ పిల్ల కాటుక రేఖ చెరిగిపోయింది. పాపం ఆ పిచ్చిదాని అలంకారం వృధా అయిపోయింది.

నాకు అన్నా వదినల జీవితం కూడా చక్క బర్చాలని వుంది. దానికి నాందిగా చెల్లెల్ని తట్టిలేపాను. మధు కలత నిద్రలో వుందేమో చప్పున లేచింది.

"మధూ!"

"ఏమిటక్కా?"

"నేను చెప్పినట్లు చేస్తావా?"

చేస్తానన్నట్లు చూసింది మధు.

"రేపు మరిది వచ్చాక వదిన వచ్చాక వస్తానని మంచిగా చెప్పి పంపెయ్యి."

మధు నిద్రకళ్ళు ఆశ్చర్యంగా విచ్చుకున్నాయి.

"నువ్వు పట్టుబడ్తే నీ కాపురం కోసమైనా అమ్మ వదిన్ని ఇంటికి పిలిపిస్తుంది మధూ."

ఈసారి మధు కనుబొమలు ముడుచుకున్నాయి.

అప్రసన్నమైన విషయం విన్నదానిలా చూసింది.

"వదిన తన తప్పు తాను తెల్సుకుంది పైగా ఆమె ఆ తర్వాత మరే తప్పు చేయలేదని తెల్సింది" మధు నొప్పించే ధోరణిలో అన్నాను.

మధు ఆలోచిస్తున్నట్టుగా క్షణం ఆగి అంది.

"ఉహు—కాదులేక్కా తప్పు చేసిన ఆడదాన్ని అన్నని ఏలుకో మనడం న్యాయం కాదు."

నేను తీక్షణంగా చూసాను.

"ఏం నువ్వు మీవార్ని ఏలుకోవడం లేదా?"

"అతను మగవాడు" క్షణమయినా ఆలోచించకుండా అన్న నా చెల్లిలి వైపు విసుగ్గా చూసాను.

"తప్పు ఒప్పు అనే దానికి లాజిక్ వుండాలి అంతేకానీ ఆడమగ బేధం వుండకూడదు."

ఇక నాతో మాట్లాడడం ఇష్టం లేనట్టుగా మధు అటు తిరిగి పడు కుంది.

నేనారాత్రి జాగారం చేసాను.

★ ★ ★ ★

మర్నాడు నా చెల్లెలు సిగ్గుల మొగ్గగా రెండేళ్ళ తర్వాత నాలు గేళ్ళ కొడుకుతో భర్త ప్రక్కన కారెక్కి కూర్చుంది. నేను నవ్వుతూ చేయూపుతూ ఆమెకు వీడ్కోలిస్తున్నాను. కానీ నా మనస్సు ఆక్రో శిస్తోంది.

ఓ మగాడా! ఈ సమాజం నీకిచ్చిన ఈ నిరాంకుశత్వాన్ని మా ఆడవాళ్ళు ఎంత బాగా కాపాడుతున్నారు!

ఈ తప్పు నీది కాదయ్యా నీ చర్యల్ని సమర్థిస్తున్న మా ఆడ వాళ్ళది—మేము మారిన రోజు నువ్వు మారక తప్పదు ఆరోజు తొందర లోనే వుంది.

❋